క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి అభిషేకం



పొన్నూరు: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, 108 కిలోల పసుపుతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం లలిత సహస్ర పారాయణం, సౌందర్యలహరి, శివానందలహరి మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

పొన్నూరు: పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రసన్న రాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీల కారణంగా రెండు నెలలుగా వేతనాలు చెల్లింపులకు నోచుకోక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు వేతన చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని ఏపీ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు చందోలు రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం గుంటూరు వెస్ట్ ఎంఈవో-1 హవీలాను కలిసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. పశ్చిమ పరిధిలో ఇప్పటికీ 180 మంది ఉపాధ్యాయులకు వేతనాలు అందలేదని, ఐడీలు క్రియేట్ కాకపోవడంతో సమస్యలు ఎదురైనట్లు వివరించారు. తూర్పు ఎంఈఓ కార్యాలయాన్ని విభజించి, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటు చేసే దిశగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదే విధంగా ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో పిలుపు మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాకు తాము మద్దతు ఇస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. ఎంఈఓకు విన్నవించిన వారిలో సంఘ నాయకులు శేషిరెడ్డి, సురేష్, శేఖర్, మోజెస్, దివ్య, ప్రమీల, రమేష్‌బాబు, మహేష్ ఉన్నారు.

స్టేడియం ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు మొత్తం 59 నామినేషన్లు వచ్చాయని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. శుక్రవారం 42 నామినేషన్లు వచ్చాయన్నారు. వీటిలో వైస్ ప్రెసిడెంట్‌కి 5 నామినేషన్లు, సెక్రటరీకి 5 నామినేషన్లు, జాయింట్ సెక్రటరీకి 11 నామినేషన్లు, ట్రెజరర్‌కు 6 నామినేషన్లు, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ 15 నామినేషన్లు వచ్చాయన్నారు.

5న అతిథి అధ్యాపకుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర బోధన కోసం అతిథి అధ్యాపకుల ఎంపికకు ఈనెల 5న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ జంతుశాస్త్రంలో 55 శాతం మార్కులు కనీస అర్హతతో పాటు జాతీయ అర్హత పరీక్ష, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- వెనిగండ్ల, గోళ్లమూడి గ్రామాల్లో బాబు 'ష్యూరిటీ–మోసం గ్యారంటీ'పై ప్రచారం



వెనిగండ్లలో బాబు మోసాలపై క్యూఆర్ కోడ్, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ, మహిళలు

పెదకాకాని: ఓట్ల కోసం అమలు కాని హామీలు ఇచ్చిన చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని వెనిగండ్ల, గోళ్లమూడి గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మురళీకృష్ణ స్థానిక ప్రజల మధ్య నేలపై కూర్చుని కూటమి మోసాలను ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్కొక్క ఇంటికి సంక్షేమ పథకాల ద్వారా లక్షల్లో నగదు వస్తుందని నమ్మించారని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన బాబు ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేకపోతే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు అని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. ఆయా గ్రామాల్లో తిరిగి చంద్రబాబు మోసాలను వివరించారు. కేవలం అధికారంలోకి రావడం కోసం మోసపూరిత మాటలు, అబద్ధపు వాగ్దానాలపై ప్రమాణం చేశారన్నారే తప్ప ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో ప్రజలకు వివరించారు. బాబు మోసాలను, అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పథకాలు ఇవ్వకపోవడంతో ఒక్కొక్క కుటుంబం ఎంత నష్టపోయిందో వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని గుర్తు చేశారు. అనంతరం బాబు మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. బాబు ష్యూరిటీ మోసం–గ్యారంటీ అంటూ నినాదాలు చేశారు. గోళ్లమూడి గ్రామంలో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచి వేల్పుల శ్రావణి, ఎంపీటీసీ సభ్యురాలు కె లక్ష్మీరాజ్యం, ఉప సర్పంచి కొండముడుగుల వెంకటరెడ్డి, మాజీ సర్పంచి కొండముడుగుల శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరి శేషిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వుయ్యూరు సతీష్‌రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి తాడిబోయిన వేణుగోపాల్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, బుల్లా పేతురు, బుల్లా నాగమల్లేశ్వరరావు, బుల్లా పుష్పరాజ్యం, పగడాల మాణిక్యరావు, శ్రీను, నాగేశ్వరరావు, ఆళ్ల ధర్మారెడ్డి, చెన్నం రామకోటేశ్వరరావు, నడింపల్లి కోటేశ్వరరావు, వాసు, బలరాం, గోపిరెడ్డి, బండ్లమూడి బాసుకిరణ్, పెనుమాల అనిల్, భీమవరపు కృష్ణారెడ్డి, సుంకర కృష్ణారెడ్డి, జొన్నల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ చల్లా హనుమంత్‌యాదవ్
- ఈదులపాలెంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'



ఈదులపాలెంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్‌లు చూపుతున్న నాయకులు

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేముందని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ చల్లా హనుమంత్‌యాదవ్ ప్రశ్నించారు. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెంలో శుక్రవారం రాత్రి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లను ప్రదర్శించి ప్రజలు, కార్యకర్తలతో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించారు. ఆయన మాట్లాడుతూ కూటమి సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ, మోసం చేస్తుందన్నారు. సూపర్‌సిక్స్‌లోని పథకాలను అమలు చేయకుండా ప్రజల నెత్తిన శఠగోపం పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేలపాటి అమరజ్యోతి, జొన్నలగడ్డ రత్నం, నేలపాటి భూషణం, ఏసురత్నం, బాలు, నుదురుపాటి ఏసుపాదం, జోజిబాబు, బోరుగడ్డ ఇస్మాయెల్, ఓబయ్య, మండల పార్టీ నాయకులు దాసరి చెంచురామారావు, గంగిరెడ్డి పరమారెడ్డి, బాపతు గోవింద్‌రెడ్డి, గండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ్లం కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన రాజేష్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరురూరల్: ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుడి అభివృద్ధికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుడి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె రాజేష్‌కు ద్రావిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఆయన ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ ఎగ్జిస్టెన్షలిజం ఇన్ ది పొయిట్రీ ఆఫ్ ఏమిలీ డికెన్సన్ అంశంపై తెనాలి కేబీఆర్ అంబేద్కర్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు, కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పీఎల్ మాధవరావు అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో జీవీఆర్‌ఎస్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాలలో సాంకేతిక మెళకువలతో కూడిన విద్యను అందిస్తున్నామని జీవీఆర్‌ఎస్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ కరిమున్నీసా తెలిపారు. శుక్రవారం బుడంపాడు గ్రామంలోని కళాశాలలో ఏబీసీ పాండా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. విద్యార్థులకు కళాశాల చైర్మన్ డాక్టర్ సింధూర, వైస్ చైర్మన్ డాక్టర్ చైతన్య, సంస్థ సీఈవో దేవిశ్రీసుప్రియల చేతుల మీదుగా జాబ్ ఆఫరింగ్ లెటర్‌లను పంపిణీ చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను పొందే మంచి అవకాశం కల్పిస్తాయన్నారు. విద్యాసంస్థల ద్వారానే కంపెనీలు క్యాంపస్‌లోకి రావడం వల్ల విద్యార్థులకు నేరుగా ఉద్యోగాలను పొందే అవకాశాలు కలుగుతాయన్నారు. విద్యార్థులకు తమ నైపుణ్యాలను ప్రదర్శించే మంచి వేదిక అని అన్నారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

పుట్టగొడుగుల తయారీతో అధిక ఆదాయం

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి



పుట్టగొడుగుల తయారీని వివరిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో శుక్రవారం కోర్స్ డైరెక్టర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి మాట్లాడుతూ పుట్టగొడుగుల స్పాన్ ఎలా తయారు చేయాలో వివరించారు. పాల పుట్టగొడుగులు, ఆయిస్టర్, వరిగడ్డి, బటన్ పుట్టగొడుగుల తయారీ, వాటి పోషక విలువలు ఆరోగ్య ప్రయోజనాలు, మార్కెట్ డిమాండ్ గురించి వివరించారు. వీటిలో ప్రోటీన్స్ (19- 35%) వరి, గోధుమ, కూరగాయల కంటే అధికంగా ఉంటాయని, పొటాషియం, సోడియం నిష్పత్తి, పీచు పదార్థాలు అధికంగా ఉండడం వల్ల అధిక రక్తపోటు (బి.పి.), అధిక ఆమ్లత (అసిడిటి) వల్ల బాధపడేవారికి చాలా బాగా ఉపయోగపడుతాయన్నారు. పుట్టగొడుగులలో కొవ్వు పదార్థాలు తక్కువగా వుంటాయని, తాజా పుట్టగొడుగులలో విటమిన్–డి అధికంగా ఉంటుందని తెలిపారు. పుట్టగొడుగుల తయారీకి ఎక్కువ పెట్టుబడి అవసరం లేదని, పుట్టగొడుగులను 35–40 రోజులలో పెంచవచ్చన్నారు. ఇంటి ఆవరణంలో కూడా వీటిని సులభంగా పెంచవచ్చని, అధిక దిగుబడులు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పంట అయిపోయిన తరువాత దిండ్లను ఎరువుగా లేదా బయోగ్యాస్ తయారీకి వాడుకోవచ్చని, గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు, సన్నకారు రైతులు పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టినట్లయితే అధిక దిగుబడులను పొందడమే కాకుండా, ఉపాధిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు, తల్లిదండ్రులకు భోజనాన్ని అందిస్తున్న ఎంఈఓ

కాకుమాను: ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్.ఈ.పీ.2020)ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెదనందిపాడులో శుక్రవారం సమగ్ర శిక్ష గుంటూరు ఆధ్వర్యంలో 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత అంగవైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను చులకనగా చూడకుండా వారు ఎంచుకున్న రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పట్ల ప్రతి రోజూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిలో మనోధైర్యాన్ని నింపాలని తెలిపారు. శిబిరంలో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.జాకబ్, ఐఈడీ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, ఐఈఆర్టీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



కాకుమానులో తల్లిపాల గురించి బాలింతలకు వివరిస్తున్న వెంకాయమ్మ



పొన్నూరులో బాలింతతో మాట్లాడుతున్న డాక్టర్



తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ అధికారులు

పొన్నూరు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్ అన్నారు. పొన్నూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన నిడుబ్రోలు వైద్యశాలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ ఫిరోజ్ ఖాన్ బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు ప్రతి రోజూ ఒక వైద్యశాలలో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ సీహెచ్ ఉమామహేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో...

గుంటూరు రూరల్: తల్లిపాలు చిన్నారులకు ఆరోగ్య అవసరని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన ప్రతి చిన్నారికి తల్లిపాలను అందించటం వల్ల తల్లికి బిడ్డకు మంచి ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనిల్‌కుమారి, సుష్మా, ఆయాలు, తల్లులు, పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు తల్లిపాలే ఆధారం

గుంటూరు రూరల్: చిన్నారుల ఆరోగ్యకరమైన జీవితానికి తల్లిపాలే ఆధారమని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ టి సంధ్య తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో విద్యార్థులకు తల్లిపాలు, చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల వంటి విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలను వదిలి పుట్టిన ప్రతి చిన్నారికి గంటలోపు తల్లిపాలను తాగించాలన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి బి జాయిస్ మాట్లాడుతూ తల్లిపాలను చిన్నారులకు పట్టకుంటే కలిగే అనర్థాలను వివరించారు. పాలను చిన్నారులకు పట్టని తల్లులకు కలిగే అనారోగ్య సమస్యలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆర్ షారోన్‌రోజ్, వి రమణ, అంజనాదేవి, పీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలి

అప్పాపురం(కాకుమాను): శిశువు జన్మనిచ్చిన తరువాత కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ అన్నారు. మండలంలోని కాకుమాను, పాండ్రపాడు సెక్టార్‌లలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కాకుమాను సెక్టార్‌లోని అప్పాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకాయమ్మ మాట్లాడుతూ శిశువుకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు ఇవ్వడంతోపాటు కనీసం శిశువుకి ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని అప్పుడే శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆమె సూచించారు. గృహసందర్శన నిర్వహించి గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లపై పుట్టిన రోజులు కేక్‌లు కట్ చేయవద్దు

నగరంపాలెం: పుట్టినరోజు వేడుకలను ఇళ్లల్లో నిర్వర్తించాలని, బహిరంగ ప్రదేశాల్లో చేయవద్దని తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ అన్నారు. రెండు రోజుల క్రితం పాతగుంటూరు పీఎస్ పరిధిలోని ఓ రహదారిపై పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన యువకులపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారని శుక్రవారం తెలిపారు. పోలీస్ చట్టం 30 అమల్లో ఉందని డీఎస్పీ అన్నారు. పుట్టిన రోజులు వేడుకలు నిర్వర్తించి, తద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగించారని చెప్పారు. అదిగాక కేక్ కట్ చేస్తూ అల్లర్లు సృష్టించారని డీఎస్పీ వివరించారు. రహదారులపై వాహనాలు నిలిపి కేక్‌లు కట్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

పాతగుంటూరు పీఎస్ పరిధిలో మూడు రోజుల క్రితం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి పది మందిపై కేసు నమోదు చేసినట్లు పాతగుంటూరు పీఎస్ సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. వీరిని శుక్రవారం గుంటూరు ఆరో ఏజేసీజే కోర్టులో హాజరుపరిచామని సీఐ చెప్పారు. రూ.48 వేలు జరిమానా జడ్జి విధించారని పేర్కొన్నారు.

కిట్స్‌లో ముగిసిన అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు హాజరైన అధ్యాపక బృందం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్)లో ఐదు రోజులుగా జరుగుతున్న అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జేఎన్‌టీయూకె సహకారంతో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో సిద్ధాంత పాఠాలు, హ్యాండ్స్–ఆన్ సెషన్లు, సిమ్యులేషన్లతో కూడిన ఆధునిక ఏఐ టెక్నాలజీలు, డేటా అనలిటిక్స్, మోడల్ ఆప్టిమైజేషన్ వంటి అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఏఐ రంగంలో తాజా పరిశోధనలు, ఆవిష్కరణలు, వైద్యం, పరిశ్రమ, వ్యవసాయం వంటి విభిన్న రంగాల్లో అనువర్తనాలపై శిక్షణ ఇచ్చారు. భవిష్యత్తులో ఏఐలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఎఫ్‌డిపికి రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ తరుణ్‌కుమార్‌రెడ్డి (ఐఐటీ రూర్కీ), డాక్టర్ గౌరవ్ కుమార్‌నాయక్ (ఐఐటీ రూర్కీ), డాక్టర్ రామ్ బిలాస్ పచోరి (ఐఐటీ ఇండోర్), డాక్టర్ రవికుమార్ (ఎన్ఐటి వరంగల్), డాక్టర్ సరళ పచ్చల (కిట్స్)లు వ్యవహరించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్‌లు పాల్గొన్నారు. అధ్యాపకులు ఎఫ్‌డీపీలో నేర్చుకున్న అంశాలు విద్యారంగ అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ ఎన్.ఆదినారాయణ, ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్లు డాక్టర్ యు.వి.రత్నకుమారి, జె. సునీత, కె.రామకృష్ణ, పాల్గొన్నారు.

కార్పొరేషన్ పరిధిలో అనధికార కట్టడాలపై చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు




ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలను ఉపేక్షించబోమని, పట్టాభిపురంలో నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ లేకుండా, నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాన్ని కూల్చి వేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టాభిపురం, స్తంభాల గరువు, మిర్చి యార్డు రోడ్, వీఐపీ రోడ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నగరపాలక సంస్థ నుంచి నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ తీసుకోకుండా లేదా ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే పట్టణ ప్రణాళిక అధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి, చట్ట ప్రకారం కూల్చి వేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకు అనేక నిబంధనలకు సరళతరం చేసినప్పటికీ ప్లాన్ తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో అనధికార, అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పర్యవేక్షణ చేయాల్సిన వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపుపై ఇప్పటికే పలు దఫాలు తెలియచేసినా కొందరు మారడం లేదని, అటువంటి ఆక్రమణలను తక్షణం తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపు వాహనాలు రాత్రి సమయాల్లో కూడా వార్డుల వారీగా మెయిన్ రోడ్లపై పర్యటించి, ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

ఆస్తుల ఆటో మ్యూటేషన్‌తో ప్రజలకు మేలు

నెహ్రూనగర్: రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు చేయడం ద్వారా ప్రజలకు సమయం, ఖర్చులు ఆదా అవుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసులతో కలసి నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు ప్రక్రియని పరిశీలించారు. కార్యక్రమంలో నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ గోపాల్ పాల్గొన్నారు.

సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకార్చనలు



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/4వ అడ్డ రోడ్డులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి కోటి కుంకుమార్చన ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. రెండో శుక్రవారం నిత్య పూజలు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకార్చన నిర్వహించారు. అనంతరం కలువ పూలతో అర్చన, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అర్చించి విశేష హారతులిచ్చారు. ప్రత్యేకంగా నక్షత్ర హారతి వేద మంత్రాలతో పూజలు చేపట్టారు. సువాసినులకు, భక్తులకు తీర్థ, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ శర్మ మాట్లాడుతూ రెండో మంగళవారం 108 కిలోల పసుపుతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.